నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 29 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

బదిలీలెప్పుడో..?

హోంగార్డుల ఎదురుచూపులు

- కుటుంబాలకు దూరంగా విధులు
- అయోమయంలో పలువురు
- కేసీఆర్ ప్రభుత్వంలో దక్కిన గౌరవం
- పట్టించుకోని రేవంత్‌రెడ్డి సర్కారు
- ట్రాన్స్‌ఫర్స్ లేకుంటే ఆందోళన తప్పదంటూ పలువురి హెచ్చరిక

మహబూబ్‌నగర్, డిసెంబర్ 28 : నాలుగేండ్లుగా బదిలీల కోసం హోంగార్డులు ఎదురుచూస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తూ కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 800 మంది క్షేత్రస్థాయిలో హోంగార్డులు విధి నిర్వహణ కోసం ఇతర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. 2021లో అప్పటి మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఐదు జిల్లాల్లోని అన్ని పోలీస్‌స్టేషన్లకు.. ఎస్పీ కార్యాలయాలకు వీరిని బదిలీలు చేశారు. నాటి నుంచి వారి కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. మహబూబ్‌నగర్ నుంచి కూడా ఎంతోమంది హోంగార్డులు వివిధ జిల్లాలు.. మండలాలకు వెళ్లి డ్యూటీలు కొనసాగిస్తున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత సొంత జిల్లాలో ఉన్న ఏఎస్సైలు అదే జిల్లాలోనే.. పక్క మండలాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నా పరిస్థితి ఉన్నది. కానీ హోంగార్డులకు మాత్రం దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నామని, బదిలీలు చేయాలని పలుమార్లు ఎస్పీల ఎదుట గోడు వెల్లబోసుకున్న సంఘటనలు ఉన్నాయి. దీని తోడు నాలుగేండ్లుగా కళ్లుకాయలు కాసేలా బదిలీల కోసం నిరీక్షిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వేతనాలు పెంచినా.. లివింగ్ కాస్ట్ విపరీతంగా పెరగడంతో జీతం సరిపోక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇప్పటికైనా బదిలీలు జరుగుతాయోమోనని ఆశతో ఉన్నారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గుర్తింపు

ఒకనాడు హోంగార్డులు అంటే పోలీస్ అధికారులకు సేవకులుగా భావించేవారు. ఇంటిపని, వంటపని.. ఇలా అన్నీ వారితోనే చేయించుకు తోళ్లు.. ఇచ్చే అరకొర జీతానికి వెట్టిచాకిరీ చేయించేవారు.. ఒక రకంగా చెప్పాలంటే తోటమాలిగానో, ఇంట్లో వంట మనిషిగానో.. ఇంటి పనులు చూసుకునే విధంగా పనిచేయించుకునే వారు.. దినసరి వేతనం కావడంతో ఏ రోజైనా డ్యూటీకి హాజరుకాక పోతే కట్ చేసేవారు. పనిచేసిన దినాలను లెక్కించి జీతం ఇచ్చేవారు. ఆ తర్వాత తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వారి సేవలను గుర్తించింది. నెలకు రూ. 12 వేలకు జీతం పెంచారు. తర్వాత 2018లో ఒకేసారి రూ.20 వేలు పెంచడంతో వారికి గౌరవం లభించింది. పెరిగిన జీతంతో పాటు ప్రతి సంవత్సరం రూ.వెయ్యి ఇంక్రిమెంట్ ఇస్తామని ప్రకటించింది. అన్నట్లుగానే మూడేళ్ల పాటు వెయ్యి రూపాయల చొప్పున నాటి ప్రభుత్వం జీతం పెంచింది. 2021లో పీఆర్‌సీ ప్రకారం 30 శాతం పెంచుతామని ప్రకటించి, కొంత మేరకు అమలు చేయడంతో వారి జీతం రూ.27 వేలకు చేరింది. అప్పటి నుంచి అదే వేతనం కొనసాగుతుంది. ప్రస్తుత ప్రభుత్వం హోంగార్డుల సమస్యలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

> కుటుంబాలకు దూరంగా డ్యూటీలు
>
> నాలుగేండ్ల నుంచి మాకు బదిలీలు లేవు.. కుటుంబాలకు దూరంగా చాలా మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీలు అప్పుడు.. ఇప్పుడు అంటూ అధికారులు వాయిదా వేస్తున్నారు. నెల వేతనం కూడా ట్టెంకు రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమై చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా బదిలీలు చేపట్టాలి.
>
> - ఓ హోంగార్డు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా

> శ్రమకు తగ్గ జీతం లేదు మేనిఫెస్టోకు మోక్షం లేదు
>
> 'పోలీసు శాఖలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే హోంగార్డులకు శ్రమకు తగ్గ జీతం లేదు.. వారిని అక్కున చేర్చుకుంటాం.. వంద రోజుల్లో అధికారంలోకి వస్తున్నాం'.. అంటూ 2023 ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోనూ అన్ని సమస్యలు తక్షణమే పరిష్కరిస్తుకుని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదన్న ఆవేదన వారిలో మిగిలింది. అర కొర వేతనాలు కూడా సకాలంలో రాక అప్పుల్లో కూరుకు పోతున్నామని పలువురు వాపోయారు. వచ్చే జీతంతో సగం వరకు బందోబస్తులు, పెట్రోల్, ఇతర అవసరాలకే సరిపోతున్నాయని వాపోయారు. నెలవారి మెయింటెనెన్స్, రూ.వేలల్లో.. ఇంట్లో ఖర్చులు ఉంటున్నాయి. మా పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, ఖర్చులతో కుటుంబ పోషణ రోజురోజుకూ భారమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

పెరిగిన పులులు

- ఏటీఆర్‌లో 40 వరకు ఉన్నట్లు అధికారుల అంచనా..
- నల్లమలలో సఫారీ పర్యాటకులకు రెండుసార్లు ఎదురైన టైగర్లు

అచ్చంపేట, డిసెంబర్ 28 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పులుల సంఖ్య పెరిగింది. పెద్ద పులుల సంఖ్య 40 వరకు చేరినట్లు అధికారుల అంచనా.. నల్లమల అందాలను తిలకించేందుకు వెళ్తున్న సఫారీ యాత్రికులకు ఈ మధ్య కాలంలో రెండు సార్లు పులులు మార్గ మధ్యంలో కనిపించాయి. శనివారం ఉదయం యాత్రికులను సఫారీ వాహనంలో ఫారెస్ట్ అధికారులు తీసుకొని వ్యూపాయింట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో వెహికిల్‌కు అతి సమీపంలో పులి కనిపించింది. కొద్ది సేపు రోడ్డుపై నిలబడి మెల్లగా రోడ్డుమార్గం మీదుగా ముందుకు వెళ్లి అడవిలోకి వెళ్లి పోయింది. ఆ తర్వాత సఫారీ వాహనం ముందుకు కదిలింది. వాహనంలో ఉన్న సందర్శకులు పులి కదలికలను.. పులి కనిపించే వరకు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసి వీడియోలు చిత్రీకరించారు. ప్రత్యక్షంగా చూడడంతో వారి ఆనందానికి అవధుల్లేవనే చెప్పాలి. ఇదే నెల 19న సైతం సఫారీ టూర్‌కు వెళ్లిన యాత్రికులకు వ్యూపాయింట్ సమీపంలో గుండం వద్ద పులి కనిపించింది. ఒకే నెలలో రెండు సార్లు పెద్దపులి కనిపించడంతో సఫారీ టూర్‌కు వచ్చేందుకు సందర్శకులు ఉత్సాహం చూపుతున్నారు. దీంతో పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యల కారణంగానే ఏటీఆర్ ఎఫ్‌లో పెద్ద పులుల సంఖ్య పెరిగింది. ఫరహాబాద్ నుంచి వ్యూపాయింట్ వరకు సఫారీ టూర్‌కు వాహనంలో విహరించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా.. రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీ

హోరాహోరీగా తలపడుతున్న మహబూబ్‌నగర్ – మెదక్ జట్లు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 28 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ ఉత్సాహంగా జరుగుతున్నది. టోర్నీలో 33 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొనగా.. శనివారం ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. రోజంతా మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో.. మహబూబ్‌నగర్ జట్టు 35-22 పాయింట్స్ తేడాతో మెదక్‌పై, వనపర్తి 37-10 తేడాతో యాదాద్రి భువనగిరిపై, మేడ్చల్ 33-12 తేడాతో భూపాలపల్లిపై, కొత్తగూడెం 34-25 తేడాతో హన్మకొండపై, నారాయణపేట 33-10 తేడాతో సిరిసిల్లపై, ఆసిఫాబాద్ 32-30 తేడాతో నిర్మల్‌పై, సిద్దిపేట 36-11 తేడాతో జగిత్యాలపై.. హైదరాబాద్ 26-10 తేడాతో సంగారెడ్డిపై, మంచిర్యాల 27-20 తేడాతో వరంగల్‌పై.. యాదాద్రి భువనగిరి 38-25 పాయింట్లలో మెదక్‌పై, ములుగు 31- 20 తేడాతో మహబూబాబాద్‌పై, రంగారెడ్డి 37-19 తేడాతో భూపాలపల్లిపై, గద్వాల 25-16 తేడాతో ఆసిఫాబాద్‌పై, నాగర్‌కర్నూల్ 18-13 తేడాతో సిద్దిపేటపై విజయం సాధించాయి. అలాగే బాలికల విభాగంలో.. నారాయణపేట జట్టు 33-19 పాయింట్లతో ఆసిఫాబాద్‌పై, గద్వాల 52-23 తేడాతో వరంగల్‌పై, నాగర్‌కర్నూల్ 27-03 తేడాతో పెద్దపల్లిపై, వికారాబాద్ 54-39 తేడాతో పెద్దపల్లిపై, నాగర్‌కర్నూల్ 40-07 తేడాతో సంగారెడ్డిపై, వనపర్తి 35-18 తేడాతో మంచిర్యాలపై, రంగారెడ్డి 34-13 తేడాతో నిర్మల్‌పై, హైదరాబాద్ 55-18 తేడాతో ఆసిఫాబాద్‌పై, జగిత్యాల 41-40 తేడాతో ఖమ్మంపై, కొత్తగూడెం 50-31 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, వినోద్, క్రీడా సంఘాల నాయకులు విలియం, జగన్మోహన్‌గౌడ్, బాల్‌రాజ్, వేణుగోపాల్, వడెన్న, గజానంద్, నిరంజన్, చెన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌కు చేరని నీళ్లు

- టీబీ డ్యాం నుంచి నీటి విడుదల
- ఆయకట్టు రైతుల ఆందోళన

ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

అయిజ, డిసెంబర్ 28 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు తెలంగాణ ఇండెంట్ నీరు చేరలేదు. ఆర్డీఎస్ ప్రాజెక్టు పరిధిలో యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి లభ్యత తగ్గడంతో ఈనెల 26న తుంగభద్ర జలాశయం నుంచి 2024-25 ఏడాదికిగానూ 5.896 టీఎంసీల నీటివాటా నుంచి 1.078 టీఎంసీలను టీబీ బోర్డు అధికారులు విడుదల చేశారు. మొదటి ఐదు రోజులు 1,500 క్యూసెక్కులు, చివరి ఐదు రోజులు వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగుతున్నది. కాగా టీబీ డ్యాం నుంచి నీటిని విడుదల చేసి మూడ్రోజులు అవుతున్నా ఆర్డీఎస్‌కు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుంగభద్ర నదిలో నీటి లభ్యత స్వల్పంగా ఉన్నప్పటికీ ఇండెంట్ నీరు ఆనకట్టకు సకాలంలో చేరకపోవడంలో ఆంతర్యమేమిటోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. శనివారం నాటికి నీరు చేరాల్సి ఉన్నా.. ఎగువన ఉన్న కర్ణాటక రైతులు ఆర్డీఎస్ నీటిని ఎక్కడ తోడేస్తున్నారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నీటినిల్వ 6.4 అడుగులు ఉండగా.. ప్రధాన కాల్వకు 285 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అయితే ఆదివారం మధ్యాహ్నం నాటికి నీరు వచ్చే అవకాశం ఉన్నదని ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. నీళ్లు రాగానే ప్రధాన కాల్వకు నీటి విడుదల పెంచుతామని పేర్కొన్నారు.

సజావుగా గ్రామసభలు

- పూర్వపు జంగమాయపల్లి ఉంచాలని స్థానికుల డిమాండ్
- ప్రత్యేక జీపీ కొనసాగించాలన్న బలిజపల్లివాసుల తీర్మానం

పెద్దమందడి, డిసెంబర్ 28 : మండలంలోని జంట గ్రామాలైన జంగమాయపల్లి-బలిజపల్లిలో నెలకొన్న వివాదాన్ని సద్దుమణించేందుకు అధికారులు నిర్వహించిన గ్రామసభ సజావుగా ముగిసింది. శనివారం దేవాలయం వద్ద అధికారుల సమక్షంలో నిర్వహించిన సభలో పూర్వపు గ్రామ పంచాయతీనే కొనసాగించాలని జంగమాయపల్లి వాసులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇందుకు సంబంధించిన తీర్మాన పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జంగమాయపల్లి గ్రామస్థులు హెచ్చరించారు. 2018లో రెండు గ్రామాలను విడదీసి రెండు వేర్వేరు పంచాయతీలుగా మార్చారని గుర్తు చేశారు. అయితే గతంలో ఏ విధంగా రెండు గ్రామాలు ఉన్నాయో.. అదే విధంగా ఒకే గ్రామ పంచాయతీగా చేసి న్యాయం చేయాలని కోరారు. రెండు వేర్వేరు జీపీలతో జంగమాయపల్లి గ్రామానికే నష్టం వాటిల్లిందన్నారు. ఈ విషయాన్ని ఎన్ని మార్లు అధికారులతో మొరపెట్టుకున్నా గ్రామ హద్దులపై స్పందించలేదన్నారు. అందుకే బలిజపల్లిని తమ గ్రామంలో విలీనం చేసి మండల కేంద్రంగా చేయాలని జంగమాయపల్లి వాసులు విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామస్థులు కలిసి గ్రామంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామసభకు మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బలిజపల్లి గ్రామంలో..

బలిజపల్లి గ్రామ పంచాయతీని కొనసాగించాలని చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. తమ గ్రామాన్ని జంగమాయపల్లిలో విలీనం చేయొద్దని కోరారు. ప్రత్యేక గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని బలిజపల్లి వాసులు ఏకగ్రీవ తీర్మానం చేసి అధికారులకు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెండు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామసభకు హాజరైన జంగమాయపల్లివాసులు

ప్రత్యేక గ్రామ పంచాయతీగా కొనసాగించాలని చేతులెత్తిన బలిజపల్లివాసులు

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

మల్దకల్, డిసెంబర్ 28 : ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మల్దకల్ మండలంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పావనంపల్లికి చెందిన రాజుకు.. అదే గ్రామానికి చెందిన పరశురాముడు రూ.లక్ష అప్పు ఉన్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య కొద్దిరోజులుగా కొట్లాట నడుస్తున్నది. దీంతో ఇరువురు మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి పంపించారు. కాగా శనివారం రాత్రి పరశురాముడు మద్యం తాగి రాజు ఇంటిపై దాడికి వెళ్లగా అక్కడ లేకపోవడంతో అతడి తమ్ముడు ఆంజనేయులు తో గొడవపడ్డాడు. తర్వాత విషయం తెలుసుకొన్న రాజు రాత్రి వేళలో పరశురాముడి ఇంటిపై దాడికి దిగాడు. దీంతో పరశురాముడు, సరోజమ్మ, జమ్ములమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. సరోజమ్మను కర్నూల్ దవాఖానకు, మిగితా ఇద్దరిని గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నందికర్ తెలిపారు.

సీఎంఆర్ దొంగలు దొరికారు

- ఎనిమిది మందికి రిమాండ్
- 300 బస్తాలు రికవరీ

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 28 : బీచుపల్లి సమీపంలోని విజయ ఆయిల్ మిల్‌లోని గోదాం నుంచి ఈనెల 24వ తేదీన సీఎంఆర్ వడ్లు దొంగతనమైన ఘటనలో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. శనివారం 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. జానంపేటకు చెందిన మేకల వెంకటేశ్, ఆముదాలపాడుకు చెందిన ఎం.ప్రభాకర్ నాయుడు, అమరచింతకు చెందిన తోకలి విష్ణు, చిన్న చింతకుంటకు చెందిన మొగలి వెంకటేశ్, గార్లపాడుకు చెందిన చాకలి ప్రదీప్, అజీత్‌కుమార్, హెచ్.హరి శేఖర్, తెలుగు బీచుపల్లిని అరెస్టు చేసి వారి నుంచి 300 సీఎంఆర్ వడ్ల బస్తాలను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. బస్తాలను చోరీ చేసేందుకు ఉపయోగించిన డీసీఎంను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. అలంపూర్ సీఐ రవి బాబు నిందితులను అలంపూర్ కోర్టులో హాజరుపరిచారు.

తాత్కాలిక ఉపాధ్యాయులు మాకొద్దు..

పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

అలంపూర్, డిసెంబర్ 28 : తాత్కాలిక ఉపాధ్యాయులు వద్దంటూ శనివారం అలంపూర్ పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాల ఎదుట విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల ఐకాస పిలుపు మేరకు కస్తూర్బా పాఠశాలల బోధన సిబ్బంది 18రోజులుగా సమ్మెలో కొనసాగుతున్న నేపథ్యంలో విద్యాశాఖ తాత్కాలికంగా కొంత మంది ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల నుంచి కస్తూర్బాకు సర్దుబాటు చేసింది. దీంతో తాత్కాలిక ఉపాధ్యాయులు మాకు వద్దంటూ.. రెగ్యులర్‌గా వచ్చే ఉపాధ్యాయులే కావాలంటూ ఆందోళన చేపట్టారు. డీఈవో దృష్టికి సమస్య తీసుకెళ్లామని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి కృష్ణవేణి విద్యార్థినులకు నచ్చజెప్పగా, విద్యార్థులు ఆందోళన విరమించారు.

నవాబ్‌పేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

అటెండెన్స్ సరే.. చదువు చెప్పరా?

నవాబ్‌పేట, డిసెంబర్ 28 : మా పాఠశాలలో 20 రోజులుగా సదువు చెప్పేటోళ్లు లేరు.. ఒకరిద్దరు టీచర్లు వచ్చి అటెండెన్స్ తీసుకొని వెళ్లి పోతున్నారు.. అటెండెన్స్ ఉంటే సరి పోతదా.. చదువు చెప్పకుండా మా జీవితాలతో ఆటలాడుతారా అంటూ నవాబ్‌పేట కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు శనివారం విద్యార్థినులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. 6నుంచి ఇంటర్ వరకు 370 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. 20 రోజులుగా కస్తూర్బా టీచర్లు విధులను బహిష్కరించి ఆందోళన చేపడుతుండగా.. అధికారులు ఇతర పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను పంపించగా, వారు వచ్చి హాజరు తీసుకొని వెళ్లిపోతున్నారని ఆరోపించారు. దీంతో తాము పాఠ్యాంశాలు చెప్పేవారు లేక నష్టపోతున్నామని విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. స్పందించిన తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జయరాంనాయక్, ఎస్సై విక్రమ్ విద్యార్థులను సముదాయించారు. ఉపాధ్యాయులు విధులకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాలానగర్ కస్తూర్బా పాఠశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో, ఎస్సై

బోధన లేకుండా.. పరీక్షలెలా రాయాలి?

- బాలానగర్ కస్తూర్బా విద్యార్థినుల ఆందోళన

బాలానగర్, డిసెంబర్ 28 : పరీక్షలు దగ్గర పడుతున్నాయి.. టీచర్లు లేక పోతే పాఠాలు ఎవరు చెబుతారు.. పరీక్షలు ఎలా రాయాలని బాలానగర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు అధికారులను నిలదీశారు. శనివారం పాఠశాల, కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. 20 రోజులుగా టీచర్లు సమ్మె చేస్తుండగా, తమకు పాఠ్యాంశాలు బోధించకపోవడంతో చదువులో వెనుకబడి పోతున్నామని వాపోయారు. కేవలం నైట్ డ్యూటీ సిబ్బంది మాత్రమే వస్తున్నారని, ఇలాగైతే పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలని ప్రశ్నించారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపాజీ, ఎంఈవో శంకర్ విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా లాభం లేక పోయింది. చేసేది లేక ఎంఈవో శంకర్ పాఠ్యాంశాలు బోధించేందుకు మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ నుంచి బోధనా సిబ్బందిని ఏర్పాట్లు చేస్తున్నట్లు హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.